క్లుప్తంగా

హార్సిలీహిల్స్‌పై సండే సందడి

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సందర్శకులతో సందడి కనిపించింది. పర్యాటకులు ప్రకృతి సందర్శనా ప్రాంతాలను తిలకించారు. వ్యూపాయింట్ల నుంచి సుందరమైన అటవీప్రాంతాన్ని వీక్షించారు. గాలిబండపై చల్లటిగాలిని ఆస్వాదించారు. సాయంత్రం వర్షపు జల్లులు కురవడంతో వాతావరణంగా ఆహ్లాదకరంగా మారింది.

డీఎస్పీకి సన్మానం

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీఓ) డి.కొండయ్యనాయుడును బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం అన్నమయ్యజిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ పి.భగవాన్‌లు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఏనుగుమల్లమ్మకు పూజలు

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మకు ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు. ఏనుగుమల్లమ్మకు వెండి కిరీట, ఆభరణాలు, ప్రత్యేక పూలు, వేప ఆకులతో అలంకరణ చేసారు. ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

పోస్టుమార్టం చేయలేదని ఆందోళన

మదనపల్లె సిటీ : కోసువారిపల్లెలో ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన చిన్నారి రూపశ్రీకి పోస్టుమార్టం చేయడంలో ఆలస్యం చేయడంపై మృతురాలి బంధువులు స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద ఆదివారం ఆందోళన చేశారు. శనివారం సంఘటన జరిగినా ఆదివారం కూడా పోస్టుమార్టం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆ సంఘటనలో తంబళ్లపల్లె ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేశారు.

ధర్నా విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల విద్యార్థి సంఘం రాయలసీమ అధ్యక్షుడు మాల తోటి నరేష్ పిలుపునిచ్చారు. మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యల్లమ్మతల్లికి బోనాలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఆదివారం యల్లమ్మ ఆలయంలో అమ్మవారి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఆదివారం లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభించి స్వామివారికి జలాభిషేకం, పాలాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూతి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కన్నులపండువగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై మహాశివుడికి విశేష పూజలు నిర్వహించారు.

9 నుంచి రాములోరి పట్టాభిషేక మహోత్సవాలు

వాల్మీకిపురం : పట్టణంలోని శ్రీ పట్టాభిరామాలయంలో ఈ నెల 9వ తేది నుంచి టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ తెలిపారు. 9న సాయంత్రం అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సేనాధిపతి ఉత్సవం, 10వ తేదీన యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, 6:30 గంటలకు శ్రీ సీతారామ శాంతి కళ్యాణం, రాత్రి 8గంటలకు హనుమంత వాహనసేవ, 11న ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, గరుడ వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనదలచిన భక్తులు రూ.300 చెల్లించి శ్రీరామ పట్టాభిషేకం ఆర్జిత సేవలో పాల్గొనవచ్చునని తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సంతన ప్రదాయినిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారికి మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

పంట నమోదుపై స్పష్టత ఏదీ?

- ప్రకృతి విపత్తు జరిగితే సర్వం కోల్పోనున్న అన్నదాతలు
- పంట రుణాలకూ ఇ- క్రాపే ఆధారం
- పంట నమోదు చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్న రైతులు



ఇ - క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

పీలేరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పంటనమోదుపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. టీడీపీ ప్రభుత్వ తీరుతో మళ్లీ ఇబ్బందులు తప్పవా అనే అనుమానాలు వ్యక్తం చేస్తు న్నారు రైతులు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాల రైతులకు అండగా నిలిచింది. రైతుల ముంగిట సేవలు అందజేసేందుకు సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీజన్ ముందే పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు ఇ - క్రాప్ నమోదు చేయించి రైతన్నను అన్ని విధాలుగా ఆదుకుంది జగన్ ప్రభుత్వం. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు మొదలయ్యాయి. ప్రత్యేకంగా ఇ - క్రాప్ నమోదు చేపట్టకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, నష్టపరిహారాలు కోల్పోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభమవ్వగా పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా వేరుశనగ, వరి, కంది, అలసంద, ఉలవ తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఒక వైపు వర్షాభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇ - క్రాప్ నమోదు ఊసేలేదు. పంట నమోదుపై టీడీపీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అసలు పంట నమోదు చేస్తారా లేదా అనే ఆందోళన రైతులలో నెలకొంది.

గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా..

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఇ - క్రాప్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇ- క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పంట నమోదు ప్రక్రియను ప్రారంభమయ్యేది. ఆర్బీకే వ్యవసాయ సహాయకులు రైతులు పండించిన పంటను ఇ - క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది. ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించేది. ప్రకృతి వైపరీత్యాల వలన పంట దెబ్బతింటే సీజన్ పూర్తయ్యే లోపల పరిహారం అందించేందుకు ఈ క్రాప్ ఎంతగానే ఉపయోగపడేది.

పంటల నమోదు ప్రయోజనాలు

- పంట రుణాలు మంజూరవుతాయి.
- పంటల బీమా వర్తిస్తుంది.
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంట. నష్టపరి హారం అందుతుంది.
- పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు.
- సున్నావడ్డీ అమలవుతుంది. ఎరువులు, పురుగుల మందులు తక్కువ ధరకే లభిస్తాయి.
- వ్యవసాయ యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్లు మంజూరయ్యేవి.

మార్గదర్శకాలు ఇంకా రాలేదు

ఇ - క్రాప్ నమోదుకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. రైతులకు సంబంధించి సహకారం అందజేస్తాం. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఇ - క్రాప్ నమోదు కార్యక్రమం చేపడతాం.

– రమాదేవి, ఏఓ, పీలేరు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- డీఎస్పీ డి.కొండయ్యనాయుడు
- గంజాయి నిర్మూలన, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి



డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న డీఎస్పీ డి.కొండయ్యనాయుడు

మదనపల్లె : పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యతని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షిస్తే, ప్రకృతి మనందరిని రక్షిస్తుందని చెప్పారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పచ్చదనం, పరిశుభ్రత రెండూ ఆరోగ్యపరిరక్షణలో కీలక అంశాలుగా పేర్కొన్నారు. రోజురోజుకీ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. మొక్కలు నాటడం, వృక్షాల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మదనపల్లె పట్టణంలో యువత చెడుఅలవాట్లకు బానిసై తప్పుడు మార్గాల్లో వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. చాలామంది విద్యార్థిదశలోనే గంజాయి సేవిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, దీని నిర్మూలన ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. 24గంటలు పనిచేసేలా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి వారంలోపు కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పట్టణంలో కొందరు ఆకతాయిలు బైక్‌లకు సైలెన్సర్‌లు తీసివేసి, పెద్దగా శబ్దం చేసుకుంటూ రోడ్లపై శబ్దకాలుష్యానికి పాల్పడుతున్నారని, ఆస్పత్రి ఏరియాల్లో న్యూసెన్స్ చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటికోసం ప్రత్యేకంగా చిత్తూరు,బెంగళూరు బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్లో బ్లూకోల్ట్స్ టీమ్, పోలీస్ పికెట్‌లను ఏర్పాటుచేసి, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో నిమ్మనపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి, శంకర పాల్గొన్నారు.

గందరగోళంగా మారిన మంత్రి విగ్రహావిష్కరణ కార్యక్రమం

కురబలకోట: అంగళ్లులో ఆదివారం రాత్రి రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి హాజరైన విగ్రహావిష్కరణ కార్యక్రమం గందరగోళంగా మారింది. అంగళ్లు కూడలిలో ఎన్టీఆర్, వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మండల టీడీపీ నాయకులు చేపట్టారు. ఆదివారం సాయంత్రం మంత్రి వీటిని ప్రారంభిస్తారని ప్రచారం నిర్వహించారు. మంత్రి రాత్రి 7.40 నిమిషాలకు వచ్చారు. వచ్చీ రాగానే విగ్రహావిష్కరణ గావించారు. వెంటనే వర్షం ప్రారంభమైంది. మాట్లాడడానికి మంత్రి మైక్ అందుకున్నారు. అప్పుడే పవర్ కూడా పోయింది. ఒక పక్క వర్షం మరో వైపు కరెంటు పోవడంతో చీకట్లోనే గొడుగుల సాయంతో సెల్‌ఫోన్ల లైటింగ్‌లో మంత్రి ప్రసంగించాల్సి వచ్చింది. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో గత ఏడాది ఇదే రోజున అంగళ్లుకు చంద్రబాబు వస్తే దాడులు జరిగాయన్నారు. అప్పుడు కేసులు పెట్టిన వారు ఇప్పుడు కన్పించకుండా తిరుగుతున్నారన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, డి. జయచంద్రారెడ్డి, సాయి లోకేష్, బాలసుబ్రమణ్యం, జగన్ రాజు, చిన్నబాబు పాల్గొన్నారు.

సమస్యలను యూనియన్ దృష్టికి తీసుకురండి



మాట్లాడుతున్న సయ్యద్ హుసేన్‌బాషా

మదనపల్లె : ఎలక్ట్రానిక్స్, టీవీ మెకానిక్స్‌కు ఏవేని సమస్యలుంటే యూనియన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ హుసేన్‌బాషా తెలిపారు. ఆదివారం బీకే.పల్లెలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రానిక్ అండ్ టీవీ మెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో మదనపల్లె టీవీ మెకానిక్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హుసేన్‌బాషా మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ యూనియన్‌లో సభ్యత్వం నమోదుచేసుకోవాలన్నారు. అందరూ ఐకమత్యంగా సంఘటితమైనప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. యూనియన్‌లో సభ్యత్వ నమోదుతోనే కుటుంబ సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూరుతుందని, ఇన్సూరెన్స్ ప్రతి సభ్యుడు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. రాజంపేట యూనియన్ కార్యవర్గసభ్యులు సుబ్రహ్మణ్యం, మదనపల్లె యూనియన్ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మెకానిక్‌లకు వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సదుల్లా, నజీరుల్లా, హుసేన్ అలీఖాన్, చెన్నా, శ్రీనివాసులు, రెడ్డెప్పరెడ్డి, రమేష్, బాబు, హరి, ఫజుల్లా, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ జట్లు ఎంపిక

పీలేరు రూరల్ : షూటింగ్ బాల్ బాలుర, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఆదివారం స్థానిక భువన విద్యాలయంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొనగా 15 మంది చొప్పున బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన జట్లు ఈ నెల 10, 11 తేదీలలో వి.కోటలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. జట్ల వివరాలు ఆమె వెల్లడించారు. బాలుర జటు : మౌనిష్, సంజయ్, చరణ్, సాయికుమార్‌రెడ్డి, పరమేష్‌నాయక్, షణ్ముఖ, సునీల్, ప్రేమ్‌చంద్, సుబ్రమణ్యం, మహేష్, నాగేంద్ర, చరణ్, మనోజ్, రెడ్డి భారప్, బాలికల జట్టు : రెడ్డిశ్రీ, స్పందన, అమృత, అనిత, లాస్య, పూజిత, రేఖ, త్రిష, ప్రణీత, సుమిత్ర, ఫాసిహా, హర్షిత, భవ్య, జయశ్రీ, లావణ్య ఉన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిరమేష్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యామినీ కృష్ణమూర్తి మృతి తీరని లోటు



మాట్లాడుతున్న ప్రముఖ నవలా రచయిత క్రిష్ణమూర్తి

మదనపల్లె సిటీ : ప్రముఖ భరత నాట్య, కూచిపూడి, ఒడిస్సీ నృత్య కళాకారిణి డాక్టర్ యామిని కృష్ణమూర్తి మృతి తీరని లోటని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖగ్రంథాలయంలో యామినీ కృష్ణమూర్తి సంతాప సభ నిర్వహించారు. మదనపల్లెలో జన్మించి అంచలంచలుగా నాట్యకారిణిగా ఎదిగి ప్రపంచ గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. మదనపల్లెకు వన్నె తెచ్చారన్నారు. ఆమె పేరుతో మదనపల్లెలో నాట్య కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వసంతకుమారి, రచయితలు వేంపల్లి సికిందర్ ,రెడ్డప్ప, మదన్‌మోహన్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మృతికి ఐదు నిమిషాలు మౌనం పాటించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో యామినీ కృష్ణమూర్తి మృతికి సంతాప సభ నిర్వహించారు. మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మౌనం పాటించి నివాళులు అర్పించారు.

త్వరలో పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనులు

- రూ.186 కోట్లు అత్యవసర నిధులు కోరాం
- శెట్టిపల్లె అక్విడెక్టు పరిశీలించిన సీఈ రాంగోపాల్



శెట్టిపల్లె వద్ద అక్విడెక్టును పరిశీలిస్తున్న సీఈ, ఎస్ఈ

బి.కొత్తకోట : హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ డి.రాంగోపాల్ చెప్పారు. బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద గతేడాది గండిపడిన అక్విడెక్టును ఆయన పరిశీలించారు. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని కుప్పానికి తరలిస్తుండగా గండిపడింది. ఇక్కడ చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు నుంచి చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం వరకు ఉన్న పుంగనూరు ఉపకాలువను ఇప్పుడున్న దానికంటే అదనంగా విస్తరణ పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వంలో టెండర్లు నిర్వహించి రూ.1,219 కోట్లకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం జరిగిందన్నారు. ఈ పనులను కాంట్రాక్టర్ త్వరలో ప్రారంభిస్తారని చెప్పారు. గతేడాది కృష్ణా జలాలు తరలించినప్పుడు కాలువకు గండిపడటం, కట్ట బలహీనపడిన చోట్ల తొలుత విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మదనపల్లె ఎస్ఈ సీఆర్.రాజగోపాల్ మాట్లాడుతూ మదనపల్లె సర్కిల్ పరిధిలోని ప్రాజెక్టు పనులకు అత్యవసరంగా రూ.186 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. కుప్పం ఉప కాలువ పనుల కోసం రూ.49 కోట్లు, పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పనులకు సంబంధించి రూ.117 కోట్లు చెల్లించాల్సివుందన్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో సాగే పుంగనూరు ఉపకాలువ పటిష్టతను పరిశీలించామని చెప్పారు. వీరివెంట ఈఈలు వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, డీఈలు త్రివేణి, శ్రీదేవి, చోక్లానాయక్, జేఈలు భాస్కర్, ఆంజినేయులు పాల్గొన్నారు.

ఆకతాయి చేష్టలతో గుట్టలకు నిప్పు

గుర్రంకొండ : రాష్ట్రంలో ఉత్తరాంధ్ర కోస్తాంధ్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి ప్రజలకు నష్టం సంభవిస్తోంది. కాగా అందుకు విరుద్ధంగా అన్నమయ్య జిల్లాలో మాత్రం వర్షాలు లేక కొండలు, గుట్టలు ఎండిపోతున్నాయి. గుట్టలు, కొండలకు గుర్తుతెలియని వ్యక్తులు ఆకతాయి చేష్టలతో నిప్పు పెడుతున్నారు. గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని తోకగుట్టకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో శనివారం రాత్రిళ్ల గుట్టలు మొత్తం కాలిపోయాయి. మంచివర్షాలతో పచ్చని పచ్చికబైళ్లతో కళకలాడుతూ ఉండాల్సిన కొండలు, గుట్టలు మాడిపోతున్నాయి.

తహసీల్దార్ల నియామకం

మదనపల్లె : అన్నమయ్య జిల్లాకు చెంది, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భాగంగా ఉన్న పలు రెవెన్యూ మండలాలకు తహసీల్దార్‌లను నియమిస్తూ చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికలు–2024 నిర్వహణలో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ కాబడి, తిరిగి సొంత జిల్లాలకు చేరుకున్న తహసీల్దార్‌లకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అందులో నిమ్మనపల్లె తహసీల్దార్‌గా కే.ధనంజయులు, గుర్రంకొండ తహసీల్దార్‌గా సి.శ్రీనివాసులు, మదనపల్లె తహసీల్దార్‌గా కే.ఖాజాబీ, కలికిరి తహసీల్దార్‌గా ఎస్.మహేశ్వరి భాయి, పీలేరు తహసీల్దార్‌గా ఎం.భీమేశ్వరరావు, రామసముద్రం తహసీల్దార్‌గా కే.నిర్మలాదేవి, బి.కొత్తకోట తహసీల్దార్‌గా బి.శ్రీధర్‌రావు, సబ్ కలెక్టరేట్ డీఏఓగా పి.పద్మావతమ్మ, పీటీఎం తహసీల్దార్‌గా ఎం.శ్రీరాములునాయక్‌లను నియమిస్తూ ఆదేశాలిచ్చారు. ఆయా మండలాల్లో ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌లు కొత్తగా నియామక ఉత్తర్వులు పొందిన అధికారులకు బాధ్యతలు అప్పగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి సహకారం

కేవీపల్లె : పాడి రైతుల అభివృద్ధికి సహకారం అందిస్తామని శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ జాండ్రపేటలో పశువుల ఆరోగ్య ప్రయోజనాల కోసం ట్రావిస్ (జంతు పరీక్షాబోను) విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో సమన్వయకర్త శశికుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, చిన్న, రెడ్డిశేఖర్, వెంకటరమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమస్యలను పరిష్కరించి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళతానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్యకర్తలు అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రభుత్వం మీదేనన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులన్నింటిలో కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టి, మీ మీ గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఇ పార్టీ పటిష్టత కోసం అందరూ ఐకమత్యంతో పనిచేయాలన్నారు. మదనపల్లెకు ఓఆర్ఆర్ రింగ్‌రోడ్డు కోసం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, ఇది కార్యరూపం దాలిస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరిపోతుందన్నారు. ప్రజలకు మంచి పరిపాలన అందించేందుకు తనకు సహకారం అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, నాదెళ్లవిద్యాసాగర్, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, బెల్లెప్రసాద్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సబ్ జూనియర్ క్యాంప్‌కు ఎంపిక



నడిమింటి అఖిల్‌వెంకట్, వి.బాలాజీ.

మదనపల్లె : బెంగళూరు, పులివెందులలో ఈనెల 13 నుంచి 27 వరకు జరగనున్న హాకీ సౌత్‌జోన్ సబ్ జూనియర్, జూనియర్ క్యాంపునకు జిల్లా వాసులు నడిమింటి అఖిల్ వెంకట్, వి.బాలాజీలు ఎంపికైనట్లు జిల్లా హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీవి.ప్రసాద్, బి.శివప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ... హాకీ ఇండియా ఆధ్వర్యంలో జూలై 10 నుంచి 17 వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరిగిన రెండో సౌత్ జోన్ జూనియర్ మెన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకి నడిమింటి అఖిల్ వెంకట్ ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. దీంతో సెలక్షన్ కమిటీ బెంగళూరులో జరగనున్న సౌత్‌జోన్ జూనియర్ మెన్ క్యాంపునకు ఎంపిక చేశారన్నారు. అలాగే జూలై 19 నుంచి 26 వరకు కేరళలోని కొల్లాంలో జరిగిన రెండో సౌత్‌జోన్ సబ్ జూనియర్ మెన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున వి.బాలాజీ ఉత్తమ ప్రతిభ కనపరచడంతో కడప జిల్లా పులివెందులలో ఈనెల 13 నుంచి 26 వరకు నిర్వహించే సబ్ జూనియర్ మెన్ క్యాంప్‌కి సెలక్షన్ కమిటీ ఎంపిక చేశారన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సౌత్ జోన్ సబ్ జూనియర్, జూనియర్ క్యాంప్‌కు ఎంపికవడంపై హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నిమ్మనపల్లె : భూవివాదం కారణంగా జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. తవళం గ్రామానికి చెందిన తలారి అన్నపూర్ణ(38), తలారి ఎల్లారెడ్డి(47)లు భార్యాభర్తలు. వీరు అదే పంచాయతీలోని నల్లంవారిపల్లె వద్ద ఉన్న భూమిని స్థానికుడైన రమేష్ బాబు ఆక్రమించుకున్నాడని సబ్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 2న నల్లంవారిపల్లెలోని భూమిని సర్వే చేస్తుండగా, ఇరువర్గాల మధ్య వివాదం రేగింది. ఈ ఘటనలో రమేష్‌బాబు తన వర్గీయులతో కలిసి కట్టెలతో అన్నపూర్ణ, ఎల్లారెడ్డిలపై దాడికి పాల్పడ్డారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

198 మందికి ఉచిత వైద్యసేవలు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె పంచాయతీ లక్ష్మీరెడ్డి గారిపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 198 మందికి వైద్యసేవలు అందించారు. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. బ్రహ్మరెడ్డి, కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ లక్ష్యంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో 80 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 198 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్య, డాక్టర్ సృజన, డాక్టర్ తేజ డాక్టర్ జిలాని, డాక్టర్ సమీమ్, వలంటీర్లు శ్రీనివాసులురెడ్డి, రామాంజనేయులు, ప్రవీణ్‌కమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు



మదనపల్లె, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, కలకడలో చౌడేశ్వరి దేవీ అలంకార దృశ్యాలు

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లెలో ఆదివారం చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోఅమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన సంతర్పణ నిర్వహించారు. ఆలయ ఆవరణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పుష్ప పల్లకిపై ఊరేగించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, నాయకులు ఉప్పు రామచంద్ర, నీలకంఠ,సిద్దప్ప పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : పరసతోపు పంచాయతీ బురుజులో వెలసిన శ్రీ వీర చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతిని ఆదివారం తొగటవీరక్షత్రియులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి కాయ,కర్పూరం,ధూప,దీప నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని మొక్కుకొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

వాల్మీకిపురం : చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి సందర్భంగా శివపురంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కలకడ : మండలంలోని కలకడ గుడిబండ కోన కదిరాయ చెరువు కే. బాటవారిపల్లె గ్రామాలలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి ని ఆదివారం తొగట వీర క్షత్రియ కులస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు.